ప్రజాశక్తి

బుధవారం 25 సెప్టెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టరును మంగళవారం అరకులోయ శారదా నికేతన్ పాఠశాలలో సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారద నికేతన్ పాఠశాల పిఆర్ఓ యల్లపు పైడయ్య మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించి, ఎంపికైన విద్యార్థులను ప్రతి పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసి అక్టోబర్ ఒకటిన జరిగే మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేస్తామన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిఆర్ఓ

విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాడేరులో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద ధర్నా : వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ ఆశ్రమాలు, పాఠశాలల్లోని అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పాడేరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి, అక్కడ ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.కార్తీక్ శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరిట ప్రభుత్వాలు గిరిజన విద్యావ్యవస్థను ప్రభుత్వం చిన్నాభిన్నం చేశాయని మండిపడ్డారు. డిగ్రీ విద్యలో చేపట్టిన సంస్కరణలతో బోధన, విద్యానాణ్యత మెరుగుపడే పరిస్థితి లేదన్నారు. డిగ్రీ విధానంలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు రూ.3,480 కోట్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. అంతకుముందు ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థులకు సంబంధం లేకుండా నేరుగా కాలేజీలకు జమ చేయడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ఉండేదన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వం అమలుచేసిన విద్యా, వసతి దీవెనల్లో రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని తల్లులు ఖాతాలకు జమ చేయడం, వారి తిరిగి కాలేజీలకు చెల్లించడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఉండేవన్నారు. ఈ క్రమంలో అనేక వాయిదాలు ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్లు తీసుకునే సమయంలో విద్యార్థులే వాటిని చెల్లించక తప్పని స్థితిలో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారన్నారు. జిఒ 77 రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు రూ.3000 వరకు పెంచాలని, పెండింగ్ బకాయిలను తక్షణమే చేయాలని, హాస్టళ్లలో పూర్తిస్థాయి వర్కర్స్‌ను నియమించాలని, రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు . యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులన్నీ భర్తీ చేయాలని, డిగ్రీ కళాశాలకు పూర్తిస్థాయి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గిరిజన విద్యాసంస్థలలో విద్యార్థుల మరణాలను అరికట్టాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబంలకు రూ.10లక్షలు చొప్పున ఇవ్వాలని, విద్యార్థుల మరణాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాస్టల్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థినీ, విద్యార్థులు అద్దెంట్లో నివాసముండి చదువుకోవాల్సిన దుస్థితి ఉందని, వెంటనే అనంతగిరిలో బాల,బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పాడేరు మండల అధ్యక్ష, కార్యదర్సులు పి. ఆనబాబు, పి.సింహాద్రి ఎస్ఎఫ్ఐ నాయకులు పి.గోపాల్, కిరణ్, సాయి కిరణ్, లావణ్య, శరణ్య, వేనేలా, గణేష్, ఆనంద్, సాయి, వివిధ కాలేజీల నుంచి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

స్వయంఉపాధిపై యువత దృష్టి పెట్టాలి

- జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్

ప్రజాశక్తి -హుకుంపేట: మత్తుకు బానిసలై యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధార్ సూచించారు. ఉద్యోగం కోసం శ్రమించాలని, లేకుంటే స్వయంఉపాధిపై దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చీకలవలస పంచాయతీ కామయ్యపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కామయ్యపేట, రౌతులపుట్టు, గుర్రాలతోట పాములాయి, ఆమూరు, గరుడపల్లి ఆరు గ్రామాల్లో గిరిజన యువతకు ఆరు వాలీబాల్ కిట్లు అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధులు మత్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరేళ్ల క్రితం పాడేరు ఎఎస్‌పిగా ఉన్నప్పుడు ఇదే గ్రామాన్ని సందర్శించానని, అప్పటికీ, ఇప్పటికీ ఎటువంటి మార్పులేదన్నారు. యువత ఇన్నోవేటివ్‌గా ఆలోచించి ప్రతిఒక్కరూ స్వయం అభివృద్ధి ఎలా చెందాలో వివరించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించాలని, అలాగని అది రాకుంటే డీలా పడిపోకుండా, స్వయంఉపాధి మార్గాలను అన్వేషించా లన్నారు. వ్యవసాయం లాభ సాటిగా లేదని భావించిన క్రమంలో, వ్యాపారం వైపు యువత మొగ్గు చూపాల న్నారు. ప్రస్తుతం ఆదాయ సము పార్జనకు ఎన్నో సన్మార్గాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చు కోవాల న్నారు. అంతేకాని ప్రభుత్వ ఉద్యోగం రాలేదన్న బాధతో, డబ్బు సంపాదనకు అక్రమ మార్గాలను అనుసరించి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎస్‌పి అమిత్‌బర్ధర్



వైద్యశిబిరం పర్యవేక్షిస్తున్నఎస్‌పి

ఏజెన్సీలో అందుబాటులో ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుని, వినూత్న ఆలోచనలతో ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో హోటల్స్, వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటు, ఇక్కడ దొరికే కలపతో వివిధ రకాల వస్తువులను తయారుచేసి, వాటిని విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చన్నారు. నగరాల్లో ఓలా క్యాబ్, బైక్ తరహాలో ఇక్కడ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, స్విగ్గీ, జొమాటో మాదిరిగా ఆహారపదార్థాల సరఫరాతో స్వయంఉపాధి పొందవవచ్చని సూచించారు. గిరిజన యువతకు ఇండస్ట్రియల్ టూర్ ప్రోగ్రాం నిర్వహించి, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలకు తీసుకెళ్లి, అక్కడ ఉత్పత్తి ప్రక్రియలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 120మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సిఐ సన్యాసినాయుడు, ఎంపిటిసి కొర్రా నాగరాజు, స్థానిక సర్పంచ్ కిల్లో బెసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘననివాళి



ఏచూరి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్నచిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి :మండలంలోని పెదబరడ పంచాయతీ, చింతలూరు గ్రామంలో చింతపల్లి, జికె.వీధి మండలాల సిపిఎం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల మరణించిన, సిపిఎం అఖిల భారత కార్యదర్శి, సీతారాం ఏచూరి జ్ఞాపకాలతో ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఘననివాళు లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఏచూరి మరణం దేశంతోపాటు ప్రపంచంలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులకు, ప్రపంచ కమ్యూనిస్టు శక్తులకు తీరని లోటన్నారు, లౌకిక భారత దేశంలో జమిలీ ఎన్నికల నిర్వహణ ఏ మాత్రం మంచిది కావని, విభిన్న భాషలు, కులాలు, రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఒకే దేశం, ఒకే ఎన్నిక సాధ్యం కాదని సిపిఎం అఖిలభారత కమిటీ ఎప్పుడో తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. మళ్లీ జమిలి ఎన్నికల ప్రస్తావన తెరపైకి తేవడంతోపాటు దానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం సరికాదన్నారు. దేశంలో ఉన్న నిరుద్యోగం, ఇతర సమస్యలను పక్కదోవ పట్టించే కుట్రలో భాగమే ఇదని విమర్శించారు. ఒకసారి ఎన్నుకున్న ప్రభుత్వం అనివార్య కారణాల వల్ల కూలిపోతే, మళ్లీ ఎన్నికలు వచ్చేంతవరకు రాష్ట్రపతి పాలన పెడతారా, లేకుంటే మళ్లీ దేశ మొత్తం ఎన్నికలు వెళ్లేలా రద్దు చేస్తారా స్పష్టం చేయాలన్నారు, ఒక ఎంపీ, లేదా ఎమ్మెల్యే మరణిస్తే అక్కడ ఎన్నిక పరిస్థితి ఏంటని ప్రశ్నించారు, అంతేకాకుండా రాష్ట్రాల హక్కులను కేంద్ర ఎన్నికల సంఘం అదుపులోకి తద్వారా కేంద్రం చేతుల్లోకి తీసుకుని, రాష్ట్రాల హక్కులను హరిస్తారా? అని ప్రశ్నించారు. ఇది ఫెడరల్ వ్యవస్థకు నష్టమని, దీనిపై రాష్ట్రంలో ఉన్న టిడిపి జనసేన వైఖరి ఏంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో సిపిఎం బలపడితేనే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ఆ దిశగా శాఖ, మండల, జిల్లా మహాసభలు షెడ్యూల్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో, సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి, పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, కిలో సింహాచలం, జీకే వీధి మండలం, అమ్మవారి దారకొండ ముర్ల రామారావు, ఉప సర్పంచ్, ముర్ల చంటిబాబు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయి చెల్లించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధర్మన్న పడాల్, బాలదేవ్

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలోని 11 మండలాల్లో కాఫీ రైతులకు 2022-23.సంవత్సరానికి సంబంధించి ఎకరానికి రూ.4వేలు చొప్పున 10 వేల ఎకరాలకు రూ.నాలుగు కోట్ల ప్రోత్సాహక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మన్న పడాల్ పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో చలో ఐటిడిఎ కార్యక్రమం నిర్వహించిన తర్వాత 2022-23. సంవత్సరానికి సంబంధించి పాత తోటల అభివృద్ధి కోసం ఎకరానికి 225 కాఫీ మొక్కలు నాటుడం, తోట అభివృద్ధికి పెట్టుబడి సహాయం కింద ఒక ఎకరానికి రూ.4 వేలుగా కేంద్ర కాఫీ బోర్డు నిర్ణయించి ఐటిడిఎకు రూ.నాలుగు కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. దీనికి సంబంధించి ఆనాటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రైతుల అకౌంట్లో వెంటనే డబ్బులు వేయాలని ఆదేశించారని. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిపేశారన్నారు.ఎన్నికల కోడ్ ముగిసి నెలలు గడుస్తున్నా, నేటికీ రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయలేదన్నారు వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయి చెల్లించాలన్నారు. అలాగే అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు కాఫీ రైతులు దగ్గర కాఫీ పండ్లు రూ.43.లతో కొనుగోలు చేసి మార్కెటింగ్ చేసి ఖర్చులు పోను మిగతా డబ్బులు రైతులకు బోనస్‌గా చెల్లిస్తామని ప్రకటించారని, క్రయవిక్రయాలు పూర్తయినా వచ్చిన లాభాల్లో రైతులకు బోనస్ చెల్లించలేదని, దాన్ని కూడా వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటేకాఫీ రైతులతో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ నేతలు

గోదావరి నిషేధిత ప్రాంతంలో అక్రమంగా చేపల వేట

- బయట నుండి వేటగాళ్లు, పడవలను తీసుకొచ్చి దర్జాగా సాగిస్తున్న మాఫియా
- చిన్న చేపలతో సహా అన్నింటినీ ఊడ్చేసి ఎగుమతి చేస్తున్న వైనం
- ముడుపుల మత్తులో పట్టించుకోని అధికార యంత్రాంగం



చేపల వేటకు ఉపయోగించే పడవలు, చేపలు తరలించడానికి సిద్ధంగా ఉంచిన బాక్స్‌లు

ప్రజాశక్తి- దేవీపట్నం

పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యాం నుంచి పాపికొండల అభయారణ్యం వరకు గోదావరిలో అక్రమంగా చేపల వేట సాగుతోంది. ఇది చేపల వేట నిషేధిత ప్రాంతం కాగా, కొంత మంది మాఫీయాగా ఏర్పడి, బయట నుండి వేటగాళ్లను, పడవలను, వందల కొద్దీ వలలను తీసుకొచ్చి దర్జాగా వేట సాగిస్తున్నారు. చిన్న చేపలతో సహా అన్నింటిని ఊడ్చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో గోదావరిలో మత్స్య సంపద ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఇంత జరుగుతున్నా ముడుపుల మత్తులో ఉన్న అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది.

కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం (కాపర్ డ్యామ్) నుంచి పాపికొండల వరకు అభయారణ్యం కింద ప్రకటించింది. ఈ ప్రాంతంలోని గోదావరిలో చేపల వేటను నిషేధించింది. అయితే కొంతమంది మాఫియాగా ఏర్పడి చేపల వేట నిషేధం ఉన్న అభయారణ్య ప్రాంతంలో వేట సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా నక్కపల్లి, కొవ్వూరు, కాకినాడ వంటి ప్రాంతం నుండి పడవలను, వేటగాళ్లను, వందల కొద్దీ వలలను తీసుకొచ్చి ఇష్టానుసారంగా గోదావరిని జల్లెడ పడుతున్నారు. అతి చిన్న చేప పిల్లల నుంచి పెద్ద చేపల వరకు పట్టి వీరవరం నుంచి ఐస్ బాక్సులో పెట్టి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులకు లక్షల రూపాయలు దళారులు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయంటే ఇది ఎంత పెద్ద వ్యవహారమో ఇట్టే అర్థమవుతుంది. ఇలా నిషేధిత ప్రాంతంలో అక్రమంగా చేపల కొనసాగితే గోదావరి నదిలో మత్స్య సంపద పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాపికొండల అభయారణ్య ప్రాంతం గోదావరిలో సాగుతున్న అక్రమ చేపల వేటను నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

వరద నష్టపరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు, పెదార్కూరు, చూచిరేవుల గూడెం, సచివాలయాల పరిధిలో వరదబాధితులకు నష్ట పరిహారం అందించాలని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు తహశీల్దారు నాగబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ వరదల సమయంలో కొన్ని పంచాయతీలకు నిత్యవసరాలు ఇచ్చి ఈ పంచాయతీలను మినహాయించడం సరికాదన్నారు. ఈ పంచాయతీలు శబరి, గోదావరి పరివాహ ప్రాంతాలను ఆనుకుని ఉన్నాయని, వీరికి కూడా నిత్యావసర సరుకులు, కుటుంబానికి రూ.10వేలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం వచ్చే చిన్నపాటి వరదలకు ఈ గ్రామాల ప్రజలు నష్టపోతున్నారని, ఆ సమయంలో నిత్యవసరాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఒక పూట తింటే ఇంకో పూట తినలేక ఇబ్బంది పడే ఈ గ్రామాల ప్రజలను ఆదుకోవాలని కోరారు. అలాగే భారీ వర్షాల వల్ల మండలంలో పంటలు దెబ్బతున్నాయని, గ్రామాల మధ్య వ్యత్యాసం చూపకుండా మండలం మొత్తాన్ని ఒక యూనిట్ చేసి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన తహసీల్దార్ నాగబాబు పైఅధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సర్పంచులు, బొగ్గా వెంకమ్మ, నాగమణి, పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు ఆవుల మురళి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

టూరిజం ప్రదేశాల్లో పర్యాటకుల రక్షణకు చర్యలు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని టూరిజం ప్రాంతాలలో పర్యాటకులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఎక్కడికక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పర్యాటకశాఖ, అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఐటిడిఎ పిఒ సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని టూరిస్టులు తిలకించే జలపాతాల వద్ద వారిని రక్షించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సిఐలతో కమిటీలు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినవారిపై కేసులు నమోదు జరిమానా విధించాలని సూచించారు. పర్యటక ప్రాంతాలలో పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పర్యాటకులు కాలువలలో దిగకుండా ఇనుప కంచె వేయాలని సూచించారు. కాలువల్లోకి దిగి ఫొటోలు తీసుకోవడానికి ఇక నుండి అనుమతించవద్దని, ఎవరైనా ఫోటోగ్రాఫర్లు టూరిస్టులను కాలువలో దిగి ఫోటోలు తీసిన ఎడల తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో కొండవాగులు పొంగుతున్నప్పుడు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కాలువలపై నడిచి రాకపోకలు నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరారు. పర్యటక ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణకు ఐటీడీఏ నుండి డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరింగ్ చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నుండి దిగువకు నీరు వదిలినప్పుడు ఎక్కువగా సైరన్ ఉపయోగించాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ టూరిస్ట్‌లకు ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, అటవీ శాఖ సబ్ డిఎఫ్ఓ బి.శ్రీరాములురావు, పర్యాటక శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.రంగబాబు, జియస్‌వి సత్యానారాయణ, సిహెచ్ శ్రీనివాసరావు, డివిజనల్ పంచాయతీ అధికారి అబ్బులు, తహశీల్దార్లు కృష్ణ జ్యోతి, సిహెచ్.శ్రీనివాసరావు, సత్యానారాయణ, అనసూయ, సుబ్రహ్మణ్యాచారి, డిప్యూటీ తహశీల్దార్లు రామకృష్ణ, బాలాజీ, బి.రాజు, పిఒపిఆర్ అండ్ ఆర్‌డి జాన్ విల్సన్, ఎంపీడీవోలు యాదగిరిశ్వరరావు, పి.జయంతి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, అడ్డతీగల సిఐ, రంపచోడవరం ఎస్ఐ మోహన్‌రావు, ఐటీడీఏ ఎస్ఓ మార్తమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఓ సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం వంతెన కొట్టుకుపోవడంతో స్తంభించిన రాకపోకలు



ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన గంగవరం వంతెన (ఫైల్‌ఫోటో)

తూరలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ గంగవరం వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాల వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఐదు గ్రామాల ప్రజల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. తమ పిల్లలకు చదువు చెప్పడానికి పాఠశాలకు ఉపాధ్యాయులు, ప్రజలు అనారోగ్యానికి గురైతే అత్యవసర సమయంలో అంబులెన్స్ తమ గ్రామాలకు రాలేని పరిస్థితి నెలకొందని గంగవరంతో పాటు ఐదు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వైద్య సేవలు అందించటానికి వైద్య సిబ్బంది కూడా ఆ గ్రామాలకు వెళ్లడానికి వీళ్లేకుండా ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి గంగవరం వంతెన కింద భాగంలో తూరలు అమర్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ప్రస్తుతం వాగులో వరద ఉధృతి తగ్గ ముఖం పట్టిందని, పనులు చేపట్టానికి ఎటువంటి అంతరాయం ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం వంతెన పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



చిలకలగెడ్డలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -అనంతగిరి : ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, సాగుచేయడం ద్వారా వ్యవసాయం లాభసాటి అవుతుందని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. చిలకలగెడ్డలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతూ, వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి, అందిపుచ్చుకోవాలన్నారు. రాయితీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్ సద్వినియోగించుకోవాలని సూచించారు. చిలకలగెడ్డ, కాశీపట్నం, కొత్తూరు,బీంపోలు,గరుగుబిల్లి, లోవపల్లి పంచాయతీల్లో జీడిమామిడి తోటలు విస్తారంగా ఉన్నాయని, హార్టీకల్చర్ అధికారుల సహకారంతో జీడిమామిడి తోటల అభివృద్ధికి రుణాలు పొందాలని రైతులకు సూచించారు. పశు వైద్య శాఖ ద్వారా పాడిపశువులు, జీవాల యూనిట్లు పొందడంతోపాటు మినీ గోకులం నిర్మాణాలు పొందవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఎఒ ఉమామహేశ్వరి, కాశీపట్నం పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.గణేశ్వరరావు, ఎంపిటిసి తడ బారికి, మెట్టల కార్యదర్శి లావణ్య, హార్టీకల్చర్ అధికారి శిరీష, టిడిపి నేత చంటి, గుమ్మడి సింహాచలం, పైడిరాజు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని మఠం పంచాయతీ ఎం.బొడ్డ పుట్టు గ్రామంలో సర్పంచ్ మఠం శాంతకుమారి అధ్యక్షతన పొలం పిలుస్తుంది.కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి లీలావతి మాట్లాడుతూ, రాయితీపై ఆధునిక వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేంద్రీయ విధానంలో సాగుతో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కాఫీ, మిరియాలు, పసుపు, పిప్పళ్లు, వరి, రాజ్మా, రాగులు పంట సాగుపై రైతులకు మెలకువలు వివరించారు. అనంతరం పంట పొలాల వద్ద జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారి ప్రియాంక, స్పైసెస్ బోర్డు అధికారి కళ్యాణి, సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, పాంగి మత్స్య కొండబాబు, వార్డు సభ్యులు కె పెద్దమ్మ, నాయకులు డి రామలింగం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కన్నారావు, కొండమ్మ రైతులు పాల్గొన్నారు.

2న పకనకుడిలో పిఎం జన్‌మన్

ప్రజాశక్తి- అరకులోయ: వచ్చే నెల రెండో తేదీన అరకు వ్యాలీ మండలం పకనకుడి గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి .అభిషేక్ స్పష్టం చేశారు. మంగళవారం కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ సెక్రటరీ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. స్థానిక గిరిజన మహిళ సాబి గంగతో కలిసి పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహణపై అరకు వ్యాలీ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, అరకు వ్యాలీ నుండి సాబి గంగ జార్ఖండ్ వెళ్లి ప్రధానమంత్రి తో ముచ్చటిస్తారన్నారు. గత జనవరిలో జరిగిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం నిర్వహణపై తయారుచేసిన ఆల్బమ్‌ను ప్రధానమంత్రి బహూకరిస్తారన్నారు. విడియో స్టాల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మ్యూజియం మేనేజర్ మురళి, సిబ్బంది గణపతి, వెంగు సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్యంగా యూకలిప్టస్ తోట నరికివేత

ప్రజాశక్తి - చింతపల్లి : ఐదమెడ్డమూల్ ఏరియాలో గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులకు భంగం కలిగిస్తూ తమ ఆధీనంలోని ఎకరాల విస్తీర్ణం పట్టా వ్యవసాయ భూమిలో సరుగుడు తోటను ఎటువంటి సంబంధం లేని గిరిజనేతరులు, పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి నరకేస్తుండగా అడ్డుకున్నామని చౌడుపల్లి గ్రామానికి చెందిన లోచల వెంకటేశ్వరరావు వాపోయారు. తమ అధీనంలోని భూముల్లోని తోట నరికివేశారు. హైకోర్టు అనుమతి ఉందని అధికారులు చెప్తున్నారని వారు తప్పుబట్టారు. ఇందుకు తెగబడ్డ వ్యక్తులపై, వారికి రక్షణగా ఉన్న పోలీసులు, అధికారులుపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు ఉన్న హక్కులతో న్యాయపరంగా పోరాటం చేసి తోటను రక్షించుకుంటామని తీర్మానించారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి

-జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ అధికారులతో ప్రత్యక్షంగానూ, రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించిన పనులను వంద రోజులలో చేపట్టిన మల్టీ పర్పస్ భవనాలు, జన్ మన్ పథకంలో మంజూరు చేసిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదన నిర్మాణాలు, గోకుల షెడ్లు, బర్త్ వెయిటింగ్ హాల్స్, సిసిడిపి పనులన్నింటికి నిధులు వస్తాయని, జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ పాడేరు డివిజనుకు 45 ఏడు బర్త్ వెయిటింగ్ హాల్స్, అరకు వ్యాలీ డివిజన్కు ఏడు మంజూరు చేసామన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 170 పనులు మంజూరు చేశామని, ఇప్పటివరకు 45 పనులు పూర్తి చేశారని, మిగిలిన పనులు నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. 72 బిటి రోడ్లలో 14 పూర్తి చేశారని, మిగిలిన రోడ్డు పనులు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.పాడేరు పిఐయు విభాగంలో 28 పనులకు గాను కేవలం ఆరు పనులు పూర్తయ్యాయన్నారు. 22 సిసి రోడ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రహదారులు భవనాల శాఖకు రూ.138 లక్షలతో 26 పనులు అప్పగించామన్నారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. ఎస్ఎంఐకి మంజూరు చేసిన 146 పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజల ప్రతి స్పందన సేకరణ

స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్-24 లక్ష్యసాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్వర్ణాంధ్ర @ 2047 ప్రజల ప్రతి స్పందన సేకరించాలన్నారు. . పేదరికం లేని సమాజం, నైపుణ్యం గల యువత, అందరికీ ఆరోగ్యం, సుసంపన్నమైన సమాజం ఉండాలని కోరుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు

పర్యాటక సేవలపై ప్రజలకు అవగాహన

ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అన్ని పర్యాటక ప్రాంతాలలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక రంగంలో సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని, పర్యాటక ప్రాంతాలలో మెరుగైన పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ పనులు చేసేటప్పుడు స్థానిక వ్యాపారులను, వాణిజ్య సంస్థలను, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. వచ్చేనెల 2 వరకు జిల్లావ్యాప్తంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారాని అధికారులు చొరవ చూపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, పంచాయతీరాజ్ ఇఇ బి.కొండయ్య పడాల్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డివిఆర్ఎం. రాజు, కె.వేణుగోపాల్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, జిల్లా టూరిజం అధికారి దాసు, 22 మండలాల ఎంపిడిఒలు వర్చువల్‌గా పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ అమసగిరి గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు . తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు, టిడిపి అరకు ఇన్చార్జి సివేరి దొన్నుదొర పాల్గొన్నారు.వారికి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో ఘనంగా ఆహ్వానించారు. సభాధ్యక్షులు హుకుంపేట ఎంపిడిఒ ఆర్ వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు మాట్లాడుతూ వందరోజుల కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, ఇచ్చిన హామీల వివరాలను వివరించారు లోటుబడ్జెట్లో ఉన్న రాష్ట్రంలో సమర్థవంతంగా పరిపాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కించాయి కృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు కొర్ర తులసిరావు,కోశాధికారి వంతల నాగేశ్వరరావు సర్వ్యయులు బాకూరు వెంకటరమణ రాజు, బాలన్న, నాయకులు శంకర్, సంతోష్, బొంజు బాబు, బేసు, సుమన్, నర్సింగ్, అప్పలరాజు, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ధ్రువ కుమార్, పంచాయతీరాజ్‌శాఖ సంజీవ్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ కృష్ణారావు, ఎంఇఒ సోమేలి చెల్లయ్య, సిడిపిఒ సిహెచ్ బాలమణి దేవి, అన్ని శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కొరాయి పంచాయతీ చిన్నాంజోడిలో సర్పంచి పి కొములు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాలనను ఇంటింటికీ గిరిజనులకు వివరించారు. కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, బ్లీచింగ్‌కు చిల్లి గవ్వ నిధులు లేకుండా చేసిన ఘనత వైసిపికే దక్కిందన్నారు. పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. మాజీ సర్పంచి వెంకటరాజు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి, కూటమి నాయకులు చంటి, నర్సు, మోహన్ దాసు, గణేష్, పంచాయతీ కార్యదర్శి


హుకుంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రత్యూష పాల్గొన్నారు.

చింతపల్లి : సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని పరుగులు తీయించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడు ఆంధ్రాలు లక్ష్మణ్ అధ్యక్షతనకొత్తపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, విజయరాణి, కిల్లు రమేష్ నాయుడు, కొట్టగుళ్లి రమేష్ నాయుడు, జనసేన అల్లూరి జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ పాల్గొన్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎం విజయభారతి కళాశాల అధ్యాపకులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి పల్లంగి జ్ఞానేశ్వర్, సీనియర్ నాయకుడు పెదిరెడ్ల బేతాళుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు, సాగిన బాలకష్ణ, జన సైనికురాలు దివ్యలత, కూటమి నాయకులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కొత్తపాలెం పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల స్వాహాపై చర్యలేవీ ?

పద్మాపురం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ జన్ని భగత్‌రాం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: పద్మపురం మేజర్ పంచాయతీలో నిధుల స్వాహాపై విచారణ చేపట్టిన అధికారులు ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని పద్మపురం మేజర్ పంచాయితీ ఉప సర్పంచ్ జన్ని భగత్‌రాం ప్రశ్నించారు. గురువారం అరకులోయలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పద్మపురం మేజర్ పంచాయతీ నిధులు స్వాహాపై గతంలో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆదేశాలు మేరకు అల్లూరి జిల్లా పంచాయితీ అధికారి కొండలరావు గత నెల 17న పద్మపురం వచ్చి, విచారణ జరిపి, 15 రోజులు లోగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. .నెల రోజులు దాటుతున్న ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో నిధులు లేక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, గ్రామంలో వీధి దీపాలు లేక అంధకారంలో గిరిజనులు మగ్గుతున్న పరిస్థితి ఉందన్నారు..పంచాయతీ అభివృద్ధి నిధులు వార్డు సభ్యులకు తెలియకుండా సర్పంచ్ పెట్టేలి సుస్మిత స్వాహా చేశారని ఆరోపించారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో వార్డు సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు మరో సారి ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రాథమిక పాఠశాలకు వెళ్లే గేటును తెరిపించాలి

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మండలంలోని కించుమండ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ప్రహరీ నిర్మాణంతో మూసేసిన ప్రాథమిక పాఠశాలకు వెళ్లే గేటును తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం 516 జాతీయ రహదారిలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయన్నారు. బాలుర ఆశ్రమ పాఠశాలకు ప్రధానగేటు ఉండగా, ప్రాథమిక పాఠశాల చిన్నారులకు ప్రత్యేకంగా మరో గేటు ఉండేదన్నారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలకు చుట్టూ ప్రహరీ నిర్మించడంతో, ప్రాథమిక పాఠశాలకు వెళ్లే గేటును తొలగించారన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే . చిన్నారులకు దారి మూసుకుపోవడంతో చుట్టూ తిరిగి జాతీయ రహదారి మీదుగా పాఠశాలకు చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా గేటును పున్ణ ప్రారంభించాలని వేడుకుంటున్నా సంబంధిత ఆశ్రమ పాఠశాల యాజమాన్యం స్పందించడం లేదన్నారు. జాతీయరహదారిలో నిత్యం లెక్కలేనన్ని భారీ వాహనాల రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో తమ పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. ఇప్పటికైన ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, ప్రహరీ నిర్మాణంలో మూసేసిన గేటును పున్ణ ప్రారంభించాలని కోరారు. కాగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంరక్షణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రహరీని నిర్మించామనిఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెన్ను తెలిపారు. రెండు పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉండడంతో ప్రధాన గేటు ద్వారా ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించామన్నారు. విద్యార్థుల భద్రత, రక్షణ దృష్ట్యా, బయట వ్యక్తులు లోపలికి రాకుండా, విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు గేటును మూసేశామని స్పష్టం చేశారు.

విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- అరకులోయ: విద్యార్థిని విద్యార్థులు సేవ భావం అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ (ఎఫ్ఎసి) పట్టాసి చలపతిరావు అన్నారు. మంగళవారం అరకులోయ మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ తరపున పరిసర గ్రామాల్లో చేపట్టే పలుసేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములై సామాజిక బాధ్యతను, సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకోవడంతోపాటు సామాజిక సేవ చేయడం ద్వారా మెరుగైన సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బలరాం, డాక్టర్ బి.సుభాన్, దివ్య,మౌనిక,రోజా రాణి ఇతర అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా చలపతిరావు

ప్రజాశక్తి- అరకులోయ :అరకువేలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పట్టాసి చలపతిరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలేజీ విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ సిహెచ్ రామకృష్ణ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇదే కళాశాలలోనే వైస్ ప్రిన్సిపాల్‌గానున్న చలపతిరావుకు ప్రిన్సిపల్‌గా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా చలపతిరావును ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్, ఇతర అధ్యాపకులు, మహిళా కాలేజీ అధ్యాపకులు అభినందించారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

27న మెగా వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం గుమ్మిరేవులు, గాలికొండ పంచాయతీల పరిధిలోని చోడురాయి, చత్రాపల్లి గ్రామాల్లో ఈనెల 27న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా ఆరోగ్య వేదిక, శారద ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని, మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాలను గుమ్మిరేవులు, దారకొండ పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాపురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని బోదులూరు గ్రామంలో పాస్టర్ బాబ్ రెజీ విక్టర్స్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం కాకినాడ డాక్టర్ రత్నాకర్ ఎలైట్ డెంటల్ వారి పర్యవేక్షణలో జరుగుతుందని, ఈ సదావకాశాన్ని చుట్టుపక్కల గ్రామాలు గిరిజనులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. వివరాలకు దూడ ప్రమోద్, పాస్టర్ సామ్యూల్ రిసార్ట్స్ సన్ వారిని సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు విత్తనాలు, సోలార్ లైట్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలంలోని వరద బాధితులకు సాపిడ్ సంస్థ డైరెక్టర్ మీరా ఖాదర్ మంగళవారం బరకాలు, కూరగాయ విత్తనాలు, సోలార్ లైట్లు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని రామన్నపాలెం, పాలగూడెం, చింతూరు, కన్నాపురం, మల్లెతోట, నరసింగపేట, మామిళ్లగూడెం తదితర గ్రామాల్లో రైతులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అందేరి హిల్ పి.శిరీష బ్రాండ్ సహకారంతో సోలార్ లైట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఊర్మి దాస్, లక్ష్మి, మేరీ, కోఆర్డినేటర్ అహ్మద్ అలీ, రైతులు పాల్గొన్నారు.

జివిఎంసి చీఫ్ ఇంజినీర్‌గా శివప్రసాద్ రాజు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పలువురు ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఉద్యోగోన్నతులతో కూడిన బదిలీలు జరిగాయి. అలాగే విజయవాడ ఎపిసిఆర్‌డిఎ విభాగంలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి.శివప్రసాద్ రాజును గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది. అదేవిధంగా గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎం.వినయ్ కుమార్‌ను విజయవాడలోని ఎపి యుఎఫ్ఐడిసి చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు.


శివ ప్రసాద్ రాజు

జివిఎంసి కమిషనర్ దృష్టికి 41వ వార్డు సమస్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 41వ వార్డులో నెలకొన్న పలు సమస్యలపై వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. తమ వార్డులోని పలు వీధులలో దీపాలు వెలగకపోవడంతో వృద్ధులు, మహిళలు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుబ్బలక్ష్మి నగర్ మెయిన్ రోడ్‌లో ఉన్న డ్రైయిన్ పూడిక వల్ల వర్షాకాలంలో నీరు పొంగి రోడ్డు మీదకి ప్రవహిస్తోందన్నారు. ఆ పూడికలు వెంటనే తొలగించాలని కోరారు. అలాగే కుక్కల బెడద ఎక్కువగా ఉన్న కారణంగా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వార్డులో సానిటేషన్ మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆమె మీడియాకు తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్ణిమ

ఉద్యానవన విభాగంలో అక్రమార్కులను శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో సుందరీకరణ బాధ్యతలను చేపడుతున్న ఉద్యానవన విభాగంలో జరిగిన అక్రమాలలో దోషులు ఎవరో తేల్చి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్ చేశారు. జివిఎంసికి ప్రజలు కట్టిన పన్నులు దుర్వినియోగం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట తెలుగు శక్తి ఆధ్వర్యాన జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. అనంతరం మేయర్, కమిషనర్‌లకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, తెలుగు శక్తి యువత అభివృద్ధి సలహాదారు వి.వంశీ బాబు, బొలినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీసా కమిటీల ఎన్నికలు తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఈనెల 24 నుండి 29 వరకు జరగాల్సిన పీసా కమిటీ ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం

ప్రజాశక్తి- చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ విభాగం, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యతోపాటు సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొనుట వల్ల వ్యక్తిత్వ వికాసంతోపాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేసిన సేవా కార్యక్రమాలు తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి ధన సహాయం లేకుండా ప్రజలకు ఉచిత సేవ చేయడం తన హృదయాన్ని ఆకర్షించిందని చెప్పారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్, కళాశాల అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్‌సిహెచ్.నాగేశ్వరరావు, జి.హారతి, డాక్టర్ వై.పద్మ, కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, కె.శైలజ, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి,



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ కె.రత్నమాణిక్యం తదితరులు

ఎస్.రమేష్, ఆర్.మౌనిక, పి.అలివేలు, ప్రకాష్, శ్రీనివాస్, సుభద్ర విద్యార్థులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి పి.బాబు

ఆశ్రమ పాఠశాలలో న్యాయమూర్తి తనిఖీలు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలోని డి.భీమవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల వసతి గృహాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజమండ్రి 7వ మేజిస్ట్రేట్ పి.బాబు తనిఖీలు చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహంలోని ఉన్న మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం సరిగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన వాతావరణానికి కొన్ని సూచనలు చేశారు. విద్యార్థులను కొన్ని సబ్జెక్టులపై ప్రశ్నించి విద్యాప్రమాణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.శ్రీధర్, కెఎన్‌వి.రమణ, ఇ.గౌరీశంకర్, కోర్టు సిబ్బంది ఎస్.అనంత లక్ష్మి పాల్గొన్నారు.

వంతెన మరమ్మతు పనులు పూర్తి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం లంకపాకల- చొంపంగిగొంది మధ్యలో గల వంతెన ఇటీవల వరదల కారణంగా కోతకు గురికాగా, దారి మరమ్మతు పనులు మంగళవారంతో పూర్తయ్యాయి. ఈ నెల 8, 9 తేదీల్లో భారీ వర్షాలకు ఈ వంతెన కోతకు గురి కావడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఓ అభిషేక్ రహదారి, వంతెనను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అయితే వంతెన అప్రోచ్ కాంక్రీట్ పనులు చేపట్టడానికి వర్షం కారణంగా కొంత జాప్యం జరిగింది. వర్షం తగ్గుముఖం పట్టిన అనంతరం ఆర్ అండ్ బి ఈఈ బాల సుందర బాబు పర్యవేక్షణలో వంతెన అప్రోచ్ కాంక్రీట్ మరమతు పనులు చేపట్టారు. ఎట్టకేలకు మంగళవారంతో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. దీంతో పాడేరు- డొంకరాయి బస్ సర్వీసును సోమవారం నుంచి ట్రయల్ బేస్‌పై తిప్పడానికి అధికారులు చర్యలు చేపట్టారు. విశాఖపట్నం నుండి చింతపల్లి సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే డే అండ్ నైట్ తిరిగే బస్ సర్వీసులు, నర్సీపట్నం- సీలేరు పాసింజర్ సర్వీసులు ఇంకా పునరుద్ధరించలేదు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి భద్రాచలం బస్సులు, నర్సీపట్నం- సీలేరు పాసింజర్ సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

2న రోటరీ మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ సారథ్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని క్లబ్ ప్రెసిడెంట్ ఎండి.యాసిన్ బాబా తెలిపారు. మంగళవారం ఉదయం తమ కార్యాలయంలో నిర్వహిచిన మీడియా సమావేశంలో రోటరీక్లబ్ ప్రతినిధులతో కలసి టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22 రోటరీక్లబ్‌లకు చెందిన 48 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు.

దళితులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంబేద్కర్ ఫ్లెక్సీని చించేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపైనా, డాక్టర్ ఉమామహేశ్వరరావును కులం పేరుతో దూషించి, ఆయనపై దాడి చేసిన జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎఎంఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్), భీమ్‌సేన, కెవిపిఎస్, పలు దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఆయా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు బొడ్డు కళ్యాణ్‌రావు, జెవి.ప్రభాకర్, ఎం.సుబ్బన్న, వై.రాజు, ఎం.సుబ్బారావు, పి.గౌతమ్ పాల్గొన్నారు.